ప్రయాణం.. నరకప్రాయం

- అధ్వానంగా రోడ్లు
- దారి పొడవునా భారీ గోతులు
- ప్రమాదాల బారిన ప్రయాణికులు
- మరమ్మతులు చేపట్టాలని ప్రజల విజ్ఞప్తి



శ్రీనగర్ ప్రధాన రహదారి పరిస్థితి ఇదీ



సనత్‌నగర్‌వద్ద వుడా రోడ్డు పరిస్థితి

గాజువాక: గాజువాకలో రోడ్లు శిథిలావస్థకు గురయ్యాయి. ఎక్కడ చూసినా గోతులు దర్శనమిస్తున్నాయి. మరమ్మతులు చేయాల్సిన యంత్రాంగం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు మరింత దెబ్బతిన్నాయి. జాతీయ రహదారిపై ఎక్కడ చూసినా గోతులే దర్శనమిస్తున్నాయి. అడుగడుగునా గోతులు పడడంతో వాహన చోదకులు అవస్థలకు గురవుతున్నారు. వివిధ కాలనీలకు సంబంధించిన ప్రధాన రహదారులు సైతం గోతులతో నిండిపోయాయి. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్న వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనాలపై వెళ్లడం కంటే నడిచి వెళ్లడమే ఉత్తమమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, అవసరమైనచోట కొత్తగా నిర్మించాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

రోడ్లపై గోతులు పూడ్చడానికి అవసరమైన చర్యలను తీసుకుంటాం. ప్రస్తుతం వర్షాలు గట్టిగా కురుస్తుండడంతో రోడ్లు కూడా దెబ్బ తింటున్నాయి. వర్షాలు తగ్గిన వెంటనే అంచనాలు తయారు చేసి అవసరమైన అనుమతులు తీసుకుంటాం.

– బి.సన్యాసినాయుడు, జీవీఎంసీ జోనల్ కమిషనర్, గాజువాక



వడ్లపూడి ప్రధాన రహదారిలో గోతులు



పాతకూర్మన్నపాలెంవద్ద దువ్వాడ స్టేషన్ రోడ్ దుస్థితి



జాతీయ రహదారిపై అడుగడుగునా ఇలాంటి గోతులే

కొండలపై ఇళ్లు ఖాళీ చేయాలని నోటీసులు

అప్రమత్తంగా ఉండాలని ప్రచారం



కొండవాలు కాలనీల్లో ఆటోపై ప్రచారం

గాజువాక: తుపాను కారణంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కొండలపై నివాసముంటున్న వారు వెంటనే తమ ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని జీవీఎంసీ గాజువాక జోనల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. గాజువాక పట్టణ ప్రాంతంలోని సుమారు ఎనిమిది కొండవాలు ప్రాంతాలకు చెందిన 114 కుటుంబాలకు ఈ నోటీసులు అందజేసినట్టు జోనల్ కమిషనర్ బి.సన్యాసినాయుడు తెలిపారు. కాగా, ప్రస్తుతం కురిసిన వర్షాలకు కొండలపై నానిపోయిన ఇళ్లు ఏ క్షణమైనా పడిపోయే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో నివాసులు అప్రమత్తంగా ఉండాలని కోరుతూ ఆటో ప్రచారం కూడా చేపట్టారు. రాత్రిపూట మరింత జాగ్రత్తగా ఉండాలని సూచిస్తూ ఈ ప్రచారం సాగిస్తున్నారు. మరికొద్ది రోజుల్లో మరో తుపాను ఉందని వస్తున్న హెచ్చరికల కారణంగా కొండలపై నివాసులు తమ బంధువుల ఇళ్లకు, సురక్షిత ప్రాంతాలకు గాని వెళ్లాలని సూచిస్తున్నారు.

క్లుప్తంగా

రేపు నీటి సరఫరా బంద్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 66, 67, 68 వార్డుల పరిధిలోని అక్కిరెడ్డిపాలెం, జోగవానిపాలెం, కృష్ణానగర్, బీసీ రోడ్డు, కణితి రోడ్డు మెహర్ నగర్, గోకుల్ నగర్ తదితర ప్రాంతాల్లో గురువారం నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని జీవీఎంసీ వాటర్ సప్లై విభాగం ఏఈ మనోహరరావు తెలిపారు. పైపు లైను మార్పిడి వల్ల కొత్త పైపు లైనుకు అనుసంధానం చేసే పనుల దృష్ట్యా మంచి నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గాయపడ్డ వ్యక్తికి ఆర్థిక సాయం



బాధితుడి తండ్రికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఢిల్లీశ్వరరావు

గాజువాక: రోడ్డు ప్రమాదంలో గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న స్థానిక సంజీవగిరి కాలనీవాసి తరుణ్ కుమార్‌కు టీడీఎస్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఢిల్లీశ్వరరావు ఆర్థిక సాయం అందజేశారు. కేజీహెచ్‌కు వెళ్లి బాధితుడిని పరామర్శించిన ఢిల్లీశ్వరరావు బాధితుడి తండ్రికి రూ.10వేల నగదు అందజేశారు. ఏ అవసరం వచ్చినా తమను సంప్రదించాలని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు విష్ణు, రెడ్డి, అనిల్, చందు, కిరణ్, వినోద్, త్రినాథ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

అగనంపూడి: కశింకోట ఆర్‌ఈసీఎస్ పరిధిలోని అగనంపూడి నిర్వాసితకాలనీలో లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి ఇండోర్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని అగనంపూడికి చెందిన ప్రజా సంఘాల నాయకులు ఆర్‌ఈసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి ఎం.శ్యామలకు వినతిపత్రం అందించారు. సీపీడబ్ల్యూ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, మరణించిన కార్మికుల వారసులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. నాయకులు ఎం.వి.రమణ, బి.సత్యనారాయణ, బి.శ్రీనివాసరావు, వి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

అగనంపూడి: పోషకాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని లీ ఫార్మా డైరెక్టర్ లీలారాణి తెలిపారు. జాతీయ పోషకాహార మాసోత్సవాల సందర్భంగా దువ్వాడ వీఎస్ఈజెడ్ ఆవరణలోని లీఫార్మ సంస్థ, లీ హెల్త్ డొమెయిన్ ఆధ్వర్యంలో నెలరోజుల పాటు వివిధ పోషకాహార కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆమె చెప్పారు. ఈ మేరకు జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

నిత్యావసరాల వితరణ



పారుజాన్ బేగం కుటుంబ సభ్యులకు నిత్యావసరాలు అందజేస్తున్న బట్టు పైడిరెడ్డి

పెదగంట్యాడ: ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని 77వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు బట్టు పైడిరెడ్డి కోరారు. వార్డు పరిధిలోని దేవాడకు చెందిన పారుజాన్ బేగం అనే యువతి అలాగే పిట్టవానిపాలేనికి చెందిన రమణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆయా కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. సమాచారం అందుకున్న ఆయన ఆయా కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీ రెడ్డి, పి.వెంకటరెడ్డి, తాతారావు, ఎస్‌కే నౌషాద్, అచ్చారావు, నాగరెడ్డి, సతీష్ పాల్గొన్నారు.

మా సమస్యలన్నీ పరిష్కరించండి

గంగవరం పోర్టు నిర్వాసిత ఉద్యోగుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ సభ్యులు

డాబాగార్డెన్స్ : మా సమస్యలు పరిష్కరించే వరకు అధికారుల బదిలీలు ఆపాలని, తక్షణమే నిర్వాసిత ఉద్యోగులకు రావాల్సిన రూ.2 లక్షలు చెల్లించాలని ఆదాని గంగవరం నిర్వాసిత ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం నగరంలోని ఓ సామాజిక భవనంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సంఘ ప్రతినిధులు మాట్లాడారు. మా సమస్యలపై నిష్పక్షపాతంగా పనిచేసిన పోలీస్ అధికారులను పూర్తి పరిష్కారం లభించే వరకు బదిలీ చేయకుండా ఉంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గంగవరం పోర్టు వస్తే గంగవరం, దిబ్బపాలెం గ్రామ యువతకు మేలు జరుగుతుందని ఎంతో ఆశపడి సుమారు 1843 ఎకరాల భూమిని ఒక్క రూపాయి ధరకే ఇచ్చామన్నారు. పోర్టు ఏర్పడినప్పటి నుంచి నిర్వాసిత ఉద్యోగులుగా జీపీఎస్ కేటగిరీలో దిబ్బపాలెం గ్రామానికి 300, గంగవరం గ్రామానికి 300 ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. చాలీచాలని జీతాలతో నిర్వాసిత ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ విషయమై పోరాటాలు, ధర్నాలు, నిరసనలు చేసినా పూర్తి న్యాయం జరగలేదన్నారు. దిక్కుతోచని సమయంలో వన్‌టైం సెటిల్మెంట్‌గా రూ.50 లక్షలకు నిర్వాసిత ఉద్యోగులు డిమాండ్ చేయగా, పలుమార్లు యాజమాన్యం చర్చలు జరపగా, చివరికి రూ.27 లక్షలు ఇస్తే ఉద్యోగం నుంచి వైదొలగడానికి గంగవరం పోర్టు యాజమాన్యం, రెవెన్యూ శాఖ, విశాఖ పోలీస్ శాఖతో ఒప్పందం జరిగిందన్నారు. ఇప్పటికీ యాజమాన్యం నుంచి తమకు రావల్సిన సొమ్ము మొత్తం రాలేదని వాపోయారు. ఈ తరుణంలో అప్పటి పోర్టు యాజమాన్యంతో ఒప్పందం చేసుకున్న అధికారులు ఇప్పుడు బదిలీ కావడంతో మా సమస్యలు మళ్లీ మొదటికి వచ్చే పరిస్థితి ఏర్పడుతుందోమోనన్న ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో మాద అప్పారావు, గంటిపిల్లి అమ్మోరు, కదిరి సత్తయ్య, కదిరి సత్యానందం, పేర్ల నూకరాజు, సత్యారావు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల కట్టడిపై దృష్టి

ఏడీసీ రమణమూర్తి

మల్కాపురం: సీజనల్ వ్యాధుల కట్టడికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్టు జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి చెప్పారు. జీవీఎంసీ 60వ వార్డు పరిధిలోని జనతాకాలనీలో మంగళవారం ఏడీసీ పర్యటించి జ్వర పీడితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి ప్రాణాంతక వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వర్షాలు అధికంగా కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి శుక్రవారం, మంగళవారం ఇంట్లో అత్యవసరానికి కావాల్సిన నీటిని ఉంచుకుని, మిగిలిన నీటి పాత్రలను ఖాళీ చేయాలన్నారు. తద్వారా సీజనల్ వ్యాధుల కారక దోమల నుంచి రక్షణ పొందవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో బయాలజిస్ట్ దాడి సాంబమూర్తి, మల్కాపురం మలేరియా నివారణ సూపర్‌వైజర్ దుల్లా శ్రీనివాసరావు, ఇతర మలేరియా సిబ్బంది, జీవీఎంసీ సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఆక్రమిత స్థలంలో నిర్మాణం తొలగింపు



ఆక్రమణదారుడు నిర్మించిన ప్రహరీ



అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

గాజువాక : వడ్లపూడి నిర్వాసిత కాలనీ సెక్టార్-1 అప్పికొండ కాలనీలోని ప్రభుత్వ స్థలంలో ఒక వ్యక్తి చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని స్టీల్‌ప్లాంట్ భూసేకరణ అధికారులు మంగళవారం తొలగించారు. ప్రభుత్వ స్థలం కబ్జా శీర్షికతో ప్లాట్ నంబర్ 531 ఆక్రమణ విషయం సాక్షిలో ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన స్టీల్‌ప్లాంట్ భూసేకరణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సునీత నేతృత్వంలో డిప్యూటీ తహసీల్దార్ సంతోష్ కిరణ్, సర్వేయర్ హరీష్, గాజువాక మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మహేష్ తదితరులు సంబంధిత స్థలంలో అక్రమ నిర్మాణాన్ని తొలగించారు. మరోసారి స్థలంలో ఎలాంటి నిర్మాణం చేపట్టినా క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి ఉంటుందని ఆక్రమణదారుడిని హెచ్చరించారు. కాగా, ఆ స్థలంలో ప్రభుత్వ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యలపై ఐక్యంగా ముందుకెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జాతీయ అధ్యక్షుడు రమేంద్రకుమార్

ఏఐటీయూసీ జాతీయ అధ్యక్షుడు రమేంద్రకుమార్

ఉక్కునగరం: సమస్యలపై నిరాశ, నిస్పృహలు వద్దని ఐక్యంగా ముందుకు సాగుదామని.. ఇందుకు అవసరమైతే పోరుబాట పడదామని ఏఐటీయూసీ జాతీయ అధ్యక్షుడు రమేంద్ర కుమార్ పిలుపు నిచ్చారు. ఉక్కునగరం గురజాడ కళాక్షేత్రంలో జరుగుతున్న ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం ఏఐటీయూసీ శ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఆయన మాట్లాడుతూ ఏఐటీయూసీ దేశ పారిశ్రామిక మనుగడకు, ఆర్థిక అభివృద్ధికి శ్రమిస్తుందన్నారు. కాలగమనంలో వచ్చే మార్పులను, సవాళ్లను యూనియన్ ఎదుర్కొనే శక్తి శ్రామికులే అన్నారు. స్టీల్‌ప్లాంట్ విషయంలో యూనియన్ సమగ్ర కార్యాచరణతో ముందుకు వెళుతుందన్నారు. జాతీయ ఉపాధ్యక్షుడు డి.ఆదినారాయణ మాట్లాడుతూ విశాఖ ఉక్కు గత ఐదేళ్లుగా ప్లాంట్ కార్య నిర్వహణ లోపభూయిష్టంగా మారిందన్నారు. ఉద్యోగులకు సకాలంలో జీతభత్యాలు అందక కార్మిక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.రవీంద్రనాథ్, జి.ఓబులేసు, ఉప ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య, కోశాధికారి కొండలరావు, ఆహ్వాన సంఘం ప్రధానకార్యదర్శి జి.ఎస్.జె. అచ్యుతరావు, బి.వెంకటరావు పాల్గొన్నారు.

చినుకు పడితే వణుకే!

- ఖాళీ స్థలాల్లో నిలిచిపోతున్న వర్షపునీరు
- వృద్ధి చెందుతున్న దోమలు
- కొరవడిన కనీస చర్యలు



నీరు పోయే మార్గం లేక నిలిచిన నీరు



గాంధీనగర్‌లో చెరువును తలపిస్తున్న ఖాళీ స్థలం

పెదగంట్యాడ: ఒక పక్క భారీ వర్షాలు.. మరో పక్క విజృంభిస్తున్న విష జ్వరాలు.. దీంతో స్థానికులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. జీవీఎంసీ 76వ వార్డు పరిధి గాంధీనగర్‌లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదు. దీంతో ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు రోజుల తరబడి నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇళ్ల నుంచి వచ్చే వాడుక నీరు బయటకు వెళ్లేమార్గం లేదు. అది కాస్తా మురుగు కూపంలా మారిపోతోంది. ఇక వర్షా కాలంలో ఇక్కడ పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. ఏమాత్రం వర్షం కురిసినా నీరు నిలిచిపోయి రాకపోకలకు అవస్థలు పడుతున్నారు.

దోమల వృద్ధి

ఈ వార్డులో ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉన్నాయి. వాటి నిర్వహణ లేక పోవడంతో దోమల వృద్ధి కేంద్రాలు మారిపోతున్నాయి. స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. రోగాలబారిన పడిన ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు.

గాంధీనగర్‌లో వందలాది ఇళ్లు ఉన్నాయి. ఇక్కడ డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షపు నీర చేసి తటాకాలను తలపిస్తున్నాయి. దీంతో ముంపులో ఉంటున్నాయి. పందులు కూడా అక్కడే తిష్ట వేసి పరిసరాలను మరింత జుగుప్సాకరంగా మారుస్తున్నాయి. వంట చేసుకునే సమయంలోనూ తలుపులూ, కిటికీలూ మూసుకోవాల్సిన దుస్థితి నెలకొందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని వాపోతున్నారు. దోమల బెడద నుంచి కాపాడుకోవడానికి కాయిల్స్, లిక్విడ్‌లు పెట్టుకుంటున్నామని చెబుతున్నారు. కాలువలు మళ్లీ నిస్తే మురుగునీరు నిల్వ ఉండే అవకాశం ఉండదని చెబుతున్నారు. ఖాళీ ప్రదేశాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించాలని కోరుతున్నారు.



ఇళ్ల పక్కనే పేరుకుపోయిన నీరు

నిద్ర పట్టడం లేదు..



కాలనీలో స్థలం కొనుగోలు చేసి ఇల్లు కట్టుకుని ఉంటున్నాం. అయితే ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో నీరు నిలిచిపోవడంతో దోమలు, పందులతో ఇబ్బందులు పడుతున్నాం. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి.

– మన్మథరావు, గాంధీనగర్, 76వ వార్డు

నీరు పోయే మార్గం లేదు



గాంధీనగర్‌లో ఖాళీ ఉన్న స్థలాల్లో నీరు నిల్వ ఉండిపోతోంది. కాలువలున్నా ప్రయోజనం లేకపోతోంది. నీరు పోయే మార్గం లేకపోవడంతో ఆ నీరు కాస్తా మురుగు కూపంలా మారుతోంది. నిత్యం దుర్వాసనతో సతమతవుతున్నాం. దోమలు పెరిగిపోయి కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి.

–సాంబశివరావు, గాంధీనగర్, 76వ వార్డు

చర్యలు తీసుకుంటాం



గాంధీనగర్‌లో సమస్య మా దృష్టికి వచ్చింది. అయితే ఖాళీ స్థలాలకు సంబంధించిన యజమానులు అందుబాటులో లేరు. వారికి నోటీసులిస్తాం. నీరు నిలిచిపోకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. డ్రైనేజీ వ్యవస్థకు సంబంధించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

–డాక్టర్ కిరణ్ కుమార్, ఏఎంవోహెచ్, జీవీఎంసీ జోన్-6

వైన్‌షాపు వర్కర్లను కొనసాగించాలి

తగరపువలస: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విధులు నిర్వర్తిస్తున్న వారిని కొనసాగించాలని ఏపీ లిక్కర్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.సుధాకర్ డిమాండ్ చేశారు. ఆనందపురం మండలం వెల్లంకిలో మంగళవారం జరిగిన విశాఖ జిల్లా మద్యం దుకాణాల నిరుద్యోగ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరూ నిరుత్సాహ పడవద్దని ప్రభుత్వానికి సమస్యలు తెలిసేలా పోరాటం చేస్తామన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఇది రాష్ట్రంలో 1.75 లక్షల కార్మికుల సమస్య అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పాలకొల్లు కమల్, రాష్ట్ర నాయకులు కె.సుధాకర్, ఎండీ ఇస్మాయిల్ ఖాన్, కె.చంద్రరావు, కె.శ్రీనివాస్, తాతాజీ, భరత్, భవానీ శంకర్, జగన్, అంబేద్కర్, భాస్కర్, చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.

దేశ భాషలందు తెలుగు లెస్స

ఎమ్మెల్సీ రఘువర్మ, ఎమ్మెల్యే గణబాబు



తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: దేశ భాషలందు తెలుగు భాష లెస్స అని శ్రీకృష్ణ దేవరాయులే కీర్తించారని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం రాష్ట్రీయ ఉపాధ్యాయ తెలుగు పండిత పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం వరకు విద్యార్థులు నృత్య, నాటికలు ప్రదర్శనలు చూపరులను కట్టి పడేశాయి. తెలుగు భాష ఔన్నత్యాన్ని వివరిస్తూ వీరు చేసిన ప్రదర్శనలు, అవధానాలు, తెలుగుభాష కోసం ప్రముఖులు చేసిన కృషిని వర్ణిస్తూ పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రఘువర్మ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి పాఠ్య పుస్తకాలతో పాటు ఎంతో మంది మహా రచయితలు రాసిన సాహిత్యాన్ని చదవడం అలవర్చుకోవాలన్నారు. ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ తెలుగు భాష పై మక్కువతో చదవాలని విద్యార్థులను కోరారు. ఆర్జేడీ విజయ్‌కుమార్, డీఈవో చంద్రకళ మాట్లాడుతూ తెలుగుభాష తేనె కంటే మధురమైనదన్నారు.